క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష

కారంచేడు: మండలంలోని జరుబులవారిపాలెం, కారంచేడు-2 గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి. విజయలక్ష్మి, తహసీల్దారు ఎస్. వెంకటరత్నం తెలిపారు. జరుబులవారిపాలెం, కారంచేడులోని రెండు గ్రామ సచివాలయాల వద్ద రెండు టీంల పర్యవేక్షణలో కార్యక్రమం కొనసాగిస్తామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఇంకొల్లు (చినగంజాం): మండల సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు రాజ్యలక్ష్మి తెలిపారు. ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

31న మండల సర్వసభ్య సమావేశం

కారంచేడు: ఈనెల 31న కారంచేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి. విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

సంఘాలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్ నిర్వహించాలని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం బి.సుబ్బారావు సూచించారు. బుధవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో వైఎస్సార్ వెలుగు పథకం మండల సమాఖ్య సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా పొదుపు సంఘాల ఏపీఎంలు, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రూపు విధిగా ప్రతినెలా 10వ తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు.

రెవెన్యూ సేవలు సత్వరం అందించాలి

చీరాల టౌన్: రెవెన్యూ సేవలను సత్వరంగా అందించడంతో పాటు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. బుధవారం మాట్లాడుతూ నీటి తీరువా వసూళ్లను త్వరగా చేయాలని, అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఓటీసీ) చేయించాలన్నారు. గ్రామాల వారీగా ఓటీఎస్ వివరాలు, పెండింగ్ అర్జీలపై విచారించారు. డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఆర్ఐలు శేఖర్, శంకర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రిపోర్టర్‌కు రోటరీ క్లబ్ చేయూత



రిపోర్టర్ ధనుంజయకు నగదు సాయాన్ని అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పర్చూరు (చినగంజాం): అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న రిపోర్టర్ కట్టమూడి ధనుంజయకు పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. బుధవారం రోటరీ క్లబ్ ప్రతినిధులు రిపోర్టర్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి ఆర్థిక సాయాన్ని ఆయనకు స్వయంగా అందజేశారు. కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు కోట శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న పాల్గొన్నారు.

180 మంది రోగులకు కంటి ఆపరేషన్‌లు



పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేస్తున్న బూచేపల్లి ట్రస్ట్ సిబ్బంది

చీమకుర్తి: బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ తరఫున గుంటూరు జిల్లా పెదకాకాని శంకర్ కంటి ఆస్పత్రిలో మొదటి బ్యాచ్‌లో 180 మందికి కంటి ఆపరేషన్‌లు చేయించుకొని బుధవారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. వారికి బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ సిబ్బంది పండ్లు, బ్రెడ్‌లను అందించి ఇంటికి పంపించారు. ఈనెల 13న సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బూచేపల్లి కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో దాదాపు 973 మంది కంటి ఆపరేషన్‌లకు ఎంపికైన సంగతి తెలిసిందే. వారిని బ్యాచ్‌ల వారీగా విభజించి మొదటి బ్యాచ్‌లో 180 మందికి ఆపరేషన్‌లు చేయించి తీసుకొచ్చినట్లు బూచేపల్లి ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే సురక్ష



మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న కరణం వెంకటేష్



వల్లాపల్లిలో పత్రాలు పంపిణీ చేస్తున్న చైతన్య

వేటపాలెం:

ప్రజల సమస్యలు సత్వర పరిష్కారానికే జగనన్న సురక్ష ఏర్పాటు చేశామని చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని వేటపాలెం -3, దేశాయిపేట-2 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌కు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక పార్టీ నాయకులు పూల బొకేలు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేర్చి అండగా నిలిచారని తెలిపారు. పరిపాలన గ్రామ స్థాయిలో ప్రజల వద్దకు చేర్చడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. వలంటీర్ ద్వారా ప్రతి పథకం లబ్ధిదారుల చెంతకే చేర్చే విధంగా చేయడం ఏ రాష్ట్రంలో లేదన్నారు. ప్రతి నెలా 1వ తేదీనే ఇంటికి వచ్చి సామాజిక పింఛన్లు ఇచ్చిన చరిత్ర ఎప్పుడూ లేదన్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగి వృద్ధులు అలసి పోయేవారని గుర్తు చేశారు. రాబోవు ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిచి తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. వేటపాలెంలో సచివాలయం-3లో 1182, దేశాయిపేట సచివాలయం -2లో 1,137 మంది లబ్ధిదారులకు కుల, ఆదాయ, కొలు, సర్టిఫికెట్లను అందజేశారు. తహసీల్దార్ అశోక్‌వర్ధన్, ఎంపీడీఓ కె. నేతాజీ, ఈఓఆర్డీ శ్రీలక్ష్మి, ఏపీఓ సుధారాణి, ఏపీఎం శ్రీనివాసులు, మాజీ సర్పంచ్‌లు లేళ్ల శ్రీధర్, మున్నంగి అరుణ్‌కుమార్, కట్టా గంగయ్య, అందేకృష్ణ, షేక్ ఖాదర్, బోడ్డు సుబ్బారావు, కార్యదర్శులు, శ్రీనివాసరావు, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సర్టిఫికెట్ల పంపిణీ

పర్చూరు (చినగంజాం): మండలంలోని ఇనగల్లు, పర్చూరు సచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఇనగల్లు సచివాలయంలో జేసీఎస్ మండల కన్వీనర్ ముప్పాళ్ళ రాఘవయ్య, తహసీల్దార్ కె. సంధ్యశ్రీ, పర్చూరు సచివాలయంలో ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్ పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన

బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుభిక్ష పాలన అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వల్లాపల్లి, కొత్తూరు గ్రామ సచివాలయాల వద్ద ధ్రువపత్రాలు అందజేశారు. మండల కన్వీనర్ బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు మందా మోహన్ రావు, హెచ్ అశ్వని, వల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, ప్రత్యేకాధికారులు శ్రీనివాసరావు, కల్పన, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, తహసీల్దార్ కె. రవిబాబు, డీటీ రవికుమార్, ఈవోఆర్డీ సుమతి పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య బుధవారం సంతమాగులూరు మండలంలోని సజ్జాపురం, వెల్లల చెరువుతో పాటు అద్దంకి పట్టణంలోని కట్టకిందపాలెం సచివాలయ పరిధిలోని సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎల్. ఎస్తేరమ్మ, జేసీఎస్ మండల ఇన్‌చార్జిలు, వార్డు కౌన్సిలర్‌లు, సచివాల కన్వీనర్లు సర్పంచ్‌లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు: చివరిరోజైన బుధవారం అధికారులు 1179 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. చిమ్మిరిబండ సచివాలయం, మార్టూరు 3 సచివాలయాల పరిధిలో ఎంపీడీఓ కె. లక్ష్మీకుమారి, చిమ్మిరిబండ, మార్టూరు సర్పంచ్‌లు జంపని, నాగవర్ధని, భూక్యా సునీతా బాయి, ఎంపీపీ భూక్యా శాంతి భాయి, ఎంపీటీసీ తాళ్ళూరి నవమణి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డీటీ శ్రీను, జంపని వీరయ్య చౌదరి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



పర్చూరు: సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



చిమ్మిరిబండలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ కృష్ణకుమారి, సర్పంచ్ నాగవర్ధని



అద్దంకిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న కృష్ణ చైతన్య

భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

వేటపాలెం: నియోజకవర్గం పరిధిలోని గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులకు సూచించారు. మండల పరిధిలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో రూ. 40 లక్షల నిధులతో సచివాలయం-1 భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. అదే ప్రాంగణంలో ఉన్న పంచాయతీ రాజ్ ఆఫీస్ భవనంలో నిర్వహిస్తున్న మరమ్మతుల పనులను పరిశీలించారు. వీరి వెంట పంచాయతీ రాజ్ డీఈ శేషగిరి రావు, రాజన్‌బాబు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, జంగిలి రామారావు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

కారంచేడు: అర్హత కలిగిన విద్యార్థులు ఓటు హక్కు పొంది.. నిస్వార్థంగా వినియోగించుకొని మంచి నాయకుడిని ఎంపిక చేసుకోవాల్సి ఉందని తహసీల్దారు ఎస్. వెంకటరత్నం అన్నారు. బుధవారం స్వర్ణ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 4, పంచాయతీ కార్యాలయంలో 2, పశువుల హాస్పిటల్ 1, ప్రాథమిక పాఠశాల 1, అంగన్‌వాడీ కేంద్రం 1 కేంద్రాలను పరిశీలించిన ఆయన సిబ్బందికి తగిన సూచనలు అందించారు. అనంతరం గ్రామంలోని ఉన్నత పాఠశాలల్లోని 9, 10వ తరగతి విద్యార్థులకు స్వీప్ కార్యక్రమం ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులుగా ఎదిగి మంచి భవిష్యత్తును నిర్ణయించుకోవాలన్నారు. హెచ్ఎం ఎంవీ సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వర్ణలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు వెంకటరత్నం

జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: జగనన్న పాలనలో గడపగడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాయపాలెం సచివాలయం పరిధిలోని తిమ్మాపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తూ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలతో పరిపాలన ప్రజల వద్దకు తెచ్చారన్నారు. సీఎం జగనన్న ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు అండగా ఉండి మళ్లీ సీఎంగా చేయాలని కోరారు. మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, ఎంపీటీసీలు, మండల, గ్రామస్థాయి నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల అందజేత



తిమ్మనపాలెంలో సైకిళ్లు పంపిణీ చేస్తున్న బాచిన కృష్ణచైతన్య

మేదరమెట్ల: తిమ్మనపాలెం ఆరివారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు, ఏడు తరగతులకు చెందిన బాలికలకు ఉచితంగా ఒంగోలు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్లను బుధవారం శాప్‌నెట్‌చైర్మన్ బాచిన కృష్ణచైతన్య పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆవరణలో కల్పించిన వసతులను సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోవాలన్నారు. 18 సైకిళ్ళను అందచేసిన రోటరీ క్లబ్ నిర్వాహకులను అభినందించారు. డిస్ట్రిక్ ప్రెసిడెంట్ చుండూరి కిషోర్ బాబు, సెక్రటరీ గోపాలకృష్ణ వైస్ ప్రెసిడెంట్ సురేంద్ర బాబు, జిల్లా టిర గుండపనేని కిషోర్ బాబు, నాదెండ్ల శ్రీనివాసరావు, గుండపనేని కిషోర్, బండారు లక్ష్మీనారాయణ, హెచ్ఎం జె. శ్రీనివాసరావు, సాధినేని రఘుబాబు, ముసులూరి వెంకట్రావు, రోటరీ వికాస్ జెడ్పీహెచ్ఎస్ అధ్యక్ష్యుడు పి.అరవిందబాబు పాల్గొన్నారు.

నిధులన్నీ పంచాయతీల అభివృద్ధికే ఖర్చు చేయాలి

కొత్తపట్నం: వచ్చిన నిధులు వెనక్కు పంపకుండా ఖర్చు పెట్టి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.60 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. మొదటిగా చెత్త సంపద తయారీ కేంద్రానికి రోడ్లు వేసేందుకు, మరమ్మతులకు వాడుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ సచివాలయాలు, హెల్త్ క్లినిక్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలకు రూ.85 లక్షల బిల్లులు వారంలో అకౌంట్‌లో జమవుతాయన్నారు. కె.పల్లెపాలెం నుంచి గుండమాల వరకు గ్రావెల్ రోడ్డుకు, కె.పల్లెపాలెం, రంగాయపాలెం, గుండమాల, మోటుమాల పంచాయతీలకు వచ్చిన ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కేటాయించాలని సర్పంచ్‌లకు సూచించారు. ఎంపీడీవో పి.సుజాత, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, హౌసింగ్ ఏఈ అన్నం నాంచార్లరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో తారు రోడ్డు పనులు ప్రారంభం

చీమకుర్తి: మండల పరిషత్ నిధులు రూ.30 లక్షలతో నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ వీరాంజనేయులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏలూరి సుబ్బారావు బుధవారం ప్రారంభించారు. ఏలూరివారిపాలెం నుంచి కొనగానివారిపాలెం వరకు 500 మీటర్ల పొడవునా తారు రోడ్డు నిర్మిస్తున్నారు. ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి చేతుల మీదుగా తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన వారం రోజుల్లోపే తారు నిర్మాణం పనులు చేపట్టడంతో స్థానిక గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తారు నిర్మాణం వలన కూనంనేనివారిపాలెం నుంచి ఏలూరివారిపాలెం మీదుగా కొనగానివారిపాలెం వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలతో తోడ్పడుతుందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్

జె.పంగులూరు: వ్యవసాయానికి 9 గంటలు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. పంగులూరులో బుధవారం మండల స్థాయి సబ్ స్టేషన్ అడ్వైజర్ కమిటీ సమావేశం జరిగింది. మస్తాన్‌రావు మాట్లాడుతూ వ్యవసాయానికి కొత్త ట్రాన్స్ ఫార్మర్లు బిగించి, కొత్త కనెక్షన్లు ఇస్తున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన సమయంలో విద్యుత్ అందిస్తామని తెలిపారు. సచివాలయ పరిధిలో ఉన్న పనులను గ్రామ పంచాయితీ నగదు సర్దుబాబు చేయాలని తెలిపారు. జగనన్న లేఔట్లో, సొంత స్థలాల్లో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు డిపాజిట్ లేకుండా ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి 70 మందికి విద్యుత్ కనెక్షన్లు మంజూరయ్యాయని, వాటిలో 19 మంది వినియోగ దారులు నగదు చెల్లించారని చెప్పారు. మిగిలిన 51 మంది నగదు చెల్లించలేదని తెలిపారు. కల్లంవారిపాలెం, చిన్నమల్లవరం, అలవలపాడు గ్రామాల్లో ఉన్న సమస్యలు సర్పంచ్‌లు తెలియజేశారు. తూర్పు కొప్పెరపాడు గ్రామాల్లో విద్యుత్ లైన్లు లేనందున లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రావటం లేదని తెలిపారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి. సత్యనారాయణ, ఏఈ అంజనేయులు, ఏఈటీ బాలకోటేశ్వరావు, ఎంపీపీ తేళ్ళ నాగమ్మ, మండల ఉపాధ్యాక్షులు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయిణి వెంకటసుబ్బారావు, సర్పంచ్‌లు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

పర్చూరు ఎంఈఓగా సత్యనారాయణ

పర్చూరు (చినగంజాం): పర్చూరు ఇన్‌చార్జ్ ఎంఈఓ -1గా ఎంవీ సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. కారంచేడు ఎంఈఓ1 గా పనిచేస్తున్న ఈయన బుధవారం పర్చూరులోని మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ 1 గా అదనపు బాధ్యతలు చేపట్టారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్‌ను మండల పరిషత్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పర్చూరు ఎంఈఓ 2 వెంకటరామయ్య, కారంచేడు ఎంఈఓ 2 మొలబంటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రాజశేఖర్, గనిపిశెట్టి గోవిందరావు, తోటకూర శ్రీనివాసరావు, శోభన్, పి. వెంకన్న, బొప్పూడి భానుప్రసాద్, కె. శ్రీనివాసరావు, సీఆర్పీలు ఉమామహేశ్వరరావు, సాయి, కోటేశ్వరరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల తనిఖీ

చినగంజాం: మండలంలోని పోలింగ్ స్టేషన్‌లను తహసీల్దార్ పి. పార్వతి బుధవారం సందర్శించారు. పోలింగ్ స్టేషన్‌లోని వసతులు గురించి పూర్తి తనిఖీ నిర్వహించారు. ఆయా పోలింగ్ స్టేషన్‌లోని భవనం పరిస్థితి, అప్రోచ్ రోడ్డు సౌకర్యం, ర్యాంప్, బూత్‌లలో విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం తదితర అంశాలను ఆమె పరిశీలించారు. ఇందులో భాగంగా కడవకుదురు 2, మోటుపల్లి 3, సంతరావూరు 3, చింతగుంపల్లి 2, గొనసపూడి 2 మొత్తం 12 పోలింగ్ స్టేషన్‌లను ఆమె పరిశీలించి నివేదికను తయారు చేశారు. సర్వేయర్ లోకేష్, బూత్ స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



పోలింగ్ స్టేషన్ పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్వతి, ఇతర సిబ్బంది

స్థల కేటాయింపునకు సహకరించాలని వినతి



కృష్ణచైతన్యను కలిసి వినతిపత్రం అందదిస్తున్న చాత్తాద శ్రీవైష్ణవ సంఘం నాయకులు

అద్దంకి రూరల్: శింగరకొండలో అన్నదాన సత్రానికి స్థలం కేటాయింపుకు సహకారం అందించాలని రాష్ట్ర చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర బుధవారం రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కృష్ణచైతన్యను కలిసి వినతి పత్రం అందించారు. సంఘ ఉపాధ్యక్షుడు, బల్లికురవ మండల జేఏసీ అధ్యక్షుడు టి. నరేష్,బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య, సంఘసభ్యులు సుర్ల నగేష్, కేశవమట్టం అనిల్‌కుమార్‌సూరి, టి. మురళి పెరంబదూరి రామాంజనేయులు సంఘ పెద్దలున్నారు.

మానవత్వం చాటిన అద్దంకి 108 సిబ్బంది

అద్దంకి రూరల్: రోడ్డు వెంట చలికి వణుకుతూ గుర్తు తెలియని వృద్ధుడు పడి ఉండటాన్ని గమనించిన 108 సిబ్బంది వైద్యశాలకు తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. అద్దంకి లోని షాది ఖానా వద్ద ఒక వృద్ధుడు వర్షానికి తడుస్తూ చలికి వణుకు అపస్మారక స్థితిలో పడివున్నాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈయంటీ హరిబాబు, పైలట్ రామచంద్రయ్య 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అక్రమ ఇసుక నిల్వలపై తహసీల్దార్ దాడులు

- లారీ స్వాధీనం



అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని స్వాధీనంచేసుకున్న తహసీల్దార్, సిబ్బంది

నాగులుప్పలపాడు: అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లపై తహసీల్దార్ సుజన్ కుమార్ దాడి చేసి నిల్వ ఉంచిన ఇసుకతో పాటు లారీని స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం సాయంత్రం నాగులుప్పలపాడులో చోటు చేసుకుంది. నాగులుప్పలపాడులో అక్రమంగా ఇసుక నిల్వ చేస్తున్న పరిస్థితిని గమనించిన తహసీల్దార్ సుజన్ కుమార్ ఈ ఇసుక డంప్‌ను పరిశీలించారు. మద్దిరాలపాడు గ్రామానికి చెందిన ఖాజావలి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక నిల్వ చేస్తున్నట్లు గుర్తించి ఇసుకతో పాటు లారీని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

ఊమెన్ చాందీకి లయన్స్ క్లబ్ సభ్యుల నివాళి

ఒంగోలు అర్బన్: కేరళ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఊమెన్‌చాందీ చిత్రపటానికి లయన్స్ క్లబ్ ఆఫ్ సిటిజన్స్ సభ్యులు నివాళులర్పించారు. వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 2018లో లయన్స్ క్లబ్ అధ్యక్షుల ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా ఒంగోలు వచ్చిన సందర్భాన్ని తలుచుకున్నారు. దీనిలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, సీనియర్ నాయకులు మాంటిస్సోరి ప్రకాష్, సుధాకర్ రెడ్డి, సత్యన్ నయనాల, రామకృష్ణ, ఆంధ్రా శ్రీను, ఇక్బాల్ రాఘవ పాల్గొన్నారు.